## క్లుప్తంగా

### స్విమ్స్‌లో చిన్నపిల్లలకు ఉచిత టీకా

**తిరుపతి తుడా:** శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల పిడియాట్రిక్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు చిన్నపిల్లలకు రోగనిరోధక టీకాలు ఉచితంగా వేయనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల నుంచి ప్రతి నెలా 1 నుంచి 7వ తేదీ వరకు ఉచిత టీకాలు వేయనున్నట్లు తెలియజేశారు. అప్పుడే పుట్టిన పసిబిడ్డ నుంచి పదేళ్ల వయస్సులోపు పిల్లలకు ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం ఉచితంగా టీకాలను రూం నెంబర్ 13లో ఓపీ సమయంలో మాత్రమే వేయబడుతుందని పేర్కొన్నారు. ఇందులో బీసీజీ, ఓపీవీ, హైపటైటిస్-బీ, పెంటావ్యాక్, రోటావైరస్, న్యూమోకోక్కల్ కాంజుగేట్ వ్యాక్సిన్, ఐపీవీ, మీజిల్స్-ఎమ్, జేఈ, టీడీ, డీపీటీ వంటి టీకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

### కరపత్రాల ఆవిష్కరణ

**తిరుపతి కల్చరల్:** యోధ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో 2024 కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆదివారం రాత్రి శిల్పారామంలో గ్లామరస్ గాలాబజ్ ఈవెంట్ చేపడుతున్నట్లు నిర్వాహకుడు యోగేష్ తెలిపారు. ఈమేరకు శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు కొత్త ఏడాది గ్లామరస్ గాలాబజ్ ఈవెంట్ కరపత్రాలను ఆవిష్కరించారు. నిర్వాహక బృందం పూర్ణ, రోహిత్, ఆసీఫ్, అబ్దుల్, హర్షిత పాల్గొన్నారు.

### ఎస్వీయూ వీసీకి ఘన సన్మానం



వీసీని అభినందిస్తున్న మురళీరెడ్డి తదితరులు

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డిని శనివారం వైఎస్సార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళీరెడ్డి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సన్మానించారు. ఆయన ఆధ్వర్యంలో వర్సిటీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, భరత్‌రెడ్డి, దామ్లానాయక్, అజీమ్, మఠం గిరి, బిల్లా, ఓబుల్‌రెడ్డి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

### వైఎస్సార్ బీమా పంపిణీ



నగదు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**చంద్రగిరి:** అనారోగ్యం కారణంగా ఆకస్మికంగా వ్యక్తి మృతి చెందడంతో ప్రభుత్వం తరపున స్థానిక నేతలు శనివారం వైఎస్సార్ బీమాను అందజేశారు. మండల పరిధిలోని ఐతేపల్లికి చెందిన మునిస్వామి(43) గుండె, కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆరోగ్యం మరింత క్షీణించడంతో శుక్రవారం మృతి చెందాడు. దీంతో సమాచారం అందుకున్న సర్పంచ్ ఫాజిలా, డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి స్థానిక నేతలతో కలసి శనివారం వారిని పరామర్శించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయం నిమిత్తం మృతుడి భార్య ఈశ్వరికి రూ.10 వేలను అందజేశారు. మిగిలిన రూ.90 వేల నగదును త్వరలోనే వారి ఖాతాలో జమ చేస్తామని ఆమె తెలిపారు. ఐతేపల్లి పంచాయతీ అధ్యక్షుడు కిషోర్, నాయకులు రాజశేఖర్ రెడ్డి, అంజద్, రెహమాన్, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేష్, వలంటీర్ షబీనా పాల్గొన్నారు.

### రెడ్ చెర్రీస్‌లో ప్రతిభా పురస్కారాలు




**తిరుపతి ఎడ్యుకేషన్:** తిరుపతిలోని రెడ్ చెర్రీస్ పాఠశాలలో గత విద్యా సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మొదటి బహుమతిగా రూ.25వేలు నగదు జి.లక్ష్మీహారిక, రెండు, మూడో బహుమతులుగా డి.ప్రీతి, ఎన్.భవితలకు చెరో రూ.15 వేలు చొప్పున ఆ పాఠశాల డైరెక్టర్ సునీల్ కుమార్‌రెడ్డి అందజేశారు. ఐఐటీలో సీటు సాధించినవారికి షీల్డులను బహూకరించారు.

### పారదర్శకంగా రేషన్ పంపిణీ

**తిరుపతి అర్బన్:** ప్రతి కార్డుదారునికి రేషన్ సరుకులు పారదర్శకంగా అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం కమిషనర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు చెందిన సివిల్ సప్లయిస్ డీఎస్‌వోలు, డీఎంలతో సమావేశం నిర్వహించారు. తిరుపతి డీఎస్‌వో రాజారఘురాం, చిత్తూరు శంకరన్, నెల్లూరు వెంకటేశ్వర్లు, కడప చాముండేశ్వరి, అన్నమయ్య రఘురాంతోపాటు తిరుపతి డీఎం వై.సుమతి, కడప అర్జున్‌రావు, చిత్తూరు జయరాజులు, నెల్లూరు నరసింహులు, అన్నమయ్య శివరామమూర్తి పాల్గొన్నారు.

# వారపు సంతలో భోజన సౌకర్యం



సంత ప్రజలకు భోజనం వడ్డిస్తున్న మోహిత్‌రెడ్డి

**పాకాల:** మండలంలోని దామలచెరువు వారపు సంతలో తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రజలు, వ్యాపారులు, రైతులకు భోజనాలు అందజేశారు. ఈ సందర్భంగా శనివారం మోహిత్‌రెడ్డి వారపు సంతలో పర్యటించి రైతులు, వ్యాపారస్తులతో మాట్లాడారు. కూరగాయలు, ఆకుకూర పంటల సాగు విషయాలను అడిగి తెలుసుకున్నారు. పంట దిగుబడి, గిట్టుబాటు ధరలపై ఆరా తీశారు. అనంతరం ఆయన చేతులతో స్వయంగా భోజనాన్ని వడ్డించారు. రైతులు, వ్యాపారస్తులు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన సొంత నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. అన్ని సమయాల్లో తమకు అండగా ఉన్నారని, ఎమ్మెల్యే కుటుంబానికి రుణపడి ఉన్నామని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో తప్పకుండా తమ మద్దతు తెలుపుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సేవా లోపానికి పరిహారం చెల్లించండి

**తిరుపతి లీగల్:** సేవా లోపానికి పాల్పడినందుకు రియల్‌మీసెల్ ఫోన్ సంస్థ ఫిర్యాదికి పరిహారం చెల్లించాలని తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు చెప్పింది. తిరుపతి మంగళం, బీటీఆర్ కాలనీకి చెందిన ఎస్.అనూష తన భర్త హేమంత్ కోసం 2022 సెప్టెంబర్‌లో ఫ్లిప్‌కార్ట్ ద్వారా రూ.23,336 చెల్లించి రియల్‌మీ సంస్థకు చెందిన సెల్‌ఫోన్ కొన్నారు. ఏడాది పాటు ఆ సెల్ ఫోన్‌కు వారంటీ ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి 11వ తేదీ నుంచి సెల్‌ఫోన్ పని చేయక వివిధ సమస్యలు భార్యాభర్తలకు ఎదురయ్యాయి. దీంతో తిరుపతి తిలక్ రోడ్డులోని రియల్‌మీ కంపెనీ సర్వీస్ సెంటర్ వాసవి అసోసియేట్స్‌లో రిపేర్‌కు ఇచ్చారు. నాలుగైదుసార్లు పైగా ఆ సెల్ ఫోన్‌ను సర్వీస్ సెంటర్ సిబ్బంది మరమ్మతు చేసినా తిరిగి సమస్యలు ఎదురవుతూ వచ్చాయి. దీంతో వారు తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్‌లో రియల్‌మీ కంపెనీతో పాటు సర్వీస్ సెంటర్ అయిన వాసవి అసోసియేట్స్‌పై ఫిర్యాదు దాఖలు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన కమిషన్ అధ్యక్షుడు పార్థసారధి, సభ్యులు నాగ శేఖర్‌రెడ్డి, స్నేహలత ఫిర్యాదికి ఇదివరలో మోడల్ కలిగిన సెల్ ఫోన్ కొత్తది ఇవ్వాలని లేకుంటే 45 రోజుల్లో సెల్‌ఫోన్ విలువ రూ.23,336 చెల్లించాలని తీర్పు చెప్పారు. అలాగే రియల్‌మీ కంపెనీ, వాసవి అసోసియేట్స్ సర్వీస్ సంస్థలు కలిసి నష్టపరిహారం కింద రూ.90 వేలు 45 రోజుల్లోపు ఫిర్యాదుదారులకు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. అలా చెల్లించని పక్షంలో సెల్‌ఫోన్ విలువ, నష్టపరిహారం సొమ్ముకు తొమ్మిది శాతం వడ్డీ లెక్కన తీర్పు కాపీ అందుకున్న రోజు నుంచి చెల్లించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. అలాగే కోర్టు ఖర్చుల కింద రూ.5 వేలు ఇద్దరూ కలిసి ఫిర్యాదిదారులకు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

## కృష్ణమనాయుడుకుంట చరిత్రను బోర్డుపై లిఖించాలి



కృష్ణమనాయుడు కుంటను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

**తిరుపతి తుడా:** తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో ఆధునీకరిస్తున్న కృష్ణమనాయుడు కుంట చరిత్రను ప్రజలకు తెలిసేలా బోర్డుపై లిఖించాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. కృష్ణమనాయుడు కుంట పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెన్నారెడ్డి కాలనీలో పురాతనమైన కృష్ణమనాయుడు కుంట శిథిలావస్థకు చేరుకోవడంతో ఆధునీకరిస్తున్నామన్నారు. రూ.1.38 కోట్లతో పనులను చేపట్టామని, కుంటలోని నీరు శుభ్రంగా ఉండాలని, ప్రహరీ గోడలపై ఆధ్యాత్మిక చిత్రాలను గీయించాలని తెలిపారు. ఆమె వెంట మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# అంకిత భావంతో ప్రజాసేవ



చెవిరెడ్డి లక్ష్మిని పూలమాలతో సత్కరిస్తున్న మహిళలు

**తిరుపతిరూరల్:** నియోజకవర్గ పరిధిలో అంకిత భావంతో ప్రజా సేవ చేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జనం ముందుకు వచ్చారని, వచ్చే ఎన్నికల్లో ఆదరించి ఆశీర్వదించాలని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పేర్కొన్నారు. శనివారం రాత్రి తిరుపతి రూరల్ మండలం ముండ్లపూడి గ్రామంలో గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ శివార్ల నుంచి గ్రామపెద్దలు ఆమెకు సాదర స్వాగతం పలుకగా గ్రామంలోని గ్రామదేవతలకు ముందుగా పూజలు చేశారు. ఆ తర్వాత ప్రతి గడపకు వెళ్లి తన బిడ్డను ఆదరించాలని కోరారు. ఇప్పటి వరకు ప్రజలకు అందిన సంక్షేమం, అభివృద్ధి పనులు యథావిధిగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించాలని విన్నవించారు.

## ప్రముఖ విద్యావేత్త రామకృష్ణారెడ్డికి గౌరవ డాక్టరేట్




గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి

**తిరుపతి ఎడ్యుకేషన్:** ప్రముఖ విద్యావేత్త, ఆర్కే అబాకస్ చైర్మన్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ(ఐఏఓ) వారి ఆధ్వర్యంలో హోసూర్‌లో శనివారం ఆర్కే అబాకస్ చైర్మన్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డికి గౌరవ డాక్టరేట్ ప్రదానం అట్టహాసంగా జరిగింది. చిన్న మధ్యతరగతి వ్యవసాయ రంగంలో పుట్టి, విద్యారంగంలో రాణించి, వైవిధ్యమైన సేవలు చేసి, వేలాదిమంది విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతూ డాక్టరేట్ పొందారు. డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డిని పలువురు విద్యావేత్తలు, పారిశ్రామిక, రాజకీయ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ(ఐఏఓ) వారు గౌరవ డాక్టరేట్‌తో సత్కరించడం ఆనందంగా ఉందని, శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో మరింత మందికి విద్యాదానం చేసే అవకాశం కల్పించడం తన పూర్వజన్మ సుకృతమన్నారు.

# ఘనంగా ముగిసిన నృత్యోత్సవం



కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

**తిరుపతి కల్చరల్:** టీటీడీ సౌజన్యంతో శ్రీకృష్ణ నటరాజాలయం ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో రెండు రోజులుగా నిర్వహించిన భారతీయ సాంప్రదాయ నృత్యోత్సవాలు ఘనంగా ముగిశాయి. రెండు రోజులపాటు చేపట్టిన ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి 200 మందికిపై కళాకారులు పాల్గొని కూచిపూడి, భరతనాట్యం, జానపదం, ఒడిస్సీ తదితర నృత్య రూపకాలను ప్రదర్శించారు. పాల్గొన్న కళాకారులకు సర్టిఫికెట్లు అందించి ఘనంగా సత్కరించారు. శ్రీకృష్ణ నటరాజాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు, నృత్యాచార్యుడు కొండా రవి జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో ఘనంగా సత్కరించి అభినందించారు.

## మధురం.. సుమధురం



**తిరుపతి కల్చరల్:** మధుర గాయకుడు ఘంటసాల అని పలువురు వక్తలు కొనియాడారు. ఘంటసాల సంగీత సంపదనను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఘంటసాల శతజయంతి ఉత్సవాల్లో భాగంగా భారత కళాక్షేత్రం సహకారంతో ఘంటసాల కోడలు కలైమామణి పార్వతిరవి ఆధ్వర్యంలో శనివారం రాత్రి మహతి కళాక్షేత్రంలో పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఢిల్లీకి చెందిన సీనియర్ జర్నలిస్ట్ వెంకట ఫణి, హైదరాబాద్‌కు చెందిన రైటర్, ఆర్టిస్ట్ కృష్ణవేణి శఠగోపన్ హాజరయ్యారు. ప్రొఫెసర్ ద్వారం లక్ష్మికి ఘంటసాల పురస్కారాన్ని అందించారు. శ్రీనివాస్ ధనశ్రీ, మృదంగం విద్వాంసుడు సుధాకర్‌లకు ఘంటసాల పురస్కారంతో సత్కరించారు. ఘంటసాల పాటలకు పార్వతిరవి శిష్య బృందం ప్రదర్శించిన భరతనాట్యం నయనాందకరంగా సాగింది.

## బావిలో మృతదేహం గుర్తింపు

**రామచంద్రాపురం:** సీరామాపురం శ్రీ సిద్దేశ్వర్ తీర్థ్ ఎదురుగా ఉన్న వ్యవసాయ బావిలో లభ్యమైన మృతదేహం మధుసూదన్‌గా పోలీసులు శనివారం గుర్తించారు. పాతకందులవారిపల్లి గ్రామస్తులు మృతుని తల్లి జానకికి సమాచారం అందించారు. రాయచోటిలో ఉద్యోగం చేస్తున్న ఆమె రామచంద్రాపురం చేరుకుని మృతుడు మధుసూదన్‌గా నిర్ధారించారు.

# బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



బంగారు తిరుచ్చిపై స్వామి, అమ్మవార్లు

**చంద్రగిరి:** శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులను సాక్షాత్కారించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవను చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అంకురలో అరుదైన శస్త్రచికిత్స



అంకుర ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్ చేసుకున్న బాలుడితో వైద్యులు

**తిరుపతి తుడా:** తిరుపతిలోని అంకుర ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన ఆరిఫ్ అలీ కుమారుడు ఫౌజన్ అహ్మద్(10) స్కూల్లో ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు పదునైన పిన్నులను మింగేశాడన్నారు. అక్కడే పలు ఆసుపత్రులను సంప్రదించినా సమస్య తీవ్రం కావడంతో తిరుపతిలోని అంకుర ఆసుపత్రికి తీసుకువచ్చారని చెప్పారు. అంకురలో పల్మనాలజిస్ట్ డాక్టర్ నరసింహ, పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ విఠల్ మోహన్ బృందం ఆ బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించారని తెలిపారు. పిన్ను ఊపిరితిత్తుల్లోని వాయునాళానికి అడ్డంగా ఇరుక్కుపోవడాన్ని గుర్తించినట్టు చెప్పారు. వెంటనే అప్రమత్తమై బాలుడికి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించి ప్రాణాలను కాపాడారన్నారు. అనుభవజ్ఞులైన, అంకితభావం ఉన్న అన్ని విభాగాలకు చెందిన వైద్య బృందం అంకుర ఆస్పత్రిలో ఉండడంతోనే అరుదైన శస్త్ర చికిత్సలను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అత్యధిక వైద్య పరిజ్ఞానం తమ ఆసుపత్రి ప్రత్యేకమని ఆయన తెలిపారు. డాక్టర్ విఠల్ మోహన్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ దినేష్, డాక్టర్ రామ్మోహన్ పాల్గొన్నారు.